లచ్చి

జగన్మిత్ర



స్ట్రైక్ పీరీడ్‌లో కూడా, దొంగచాటుగా డ్యూటీలకు వెళ్ళేవాళ్ళలా, తలలు దించేసుకుని, గబగబా గుడిలోనికి దూరిపోయిన, ఓ ఇద్దరు భక్తులు మినహా, శివాలయానికి ఎవరూ రావటంలేదు.

గుడికి కొంచెం దూరంలో, కిళ్ళీషాపు గోడకు ఆనుకుని ఉన్న లచ్చిమి, పావుగంట క్రితమే గుడిలోనికి వెళ్ళిన రాము, అప్పటికీ రానందుకు 'ఇంకా రాడేట్ ?' అని, అప్పటికి ఓ మూడు మార్లైనా స్వగతంగా అనుకుంది.

'ఆ' విషయం జ్ఞాపకం రాగానే, లచ్చిమి మనసు నిండుగా తీయటి కోరికలు. వాటిని తీర్చమని, దొంగ భక్తుడిలా చేతులెత్తి దణ్ణం పెట్టలేదు. దేవుఁడేదిక్కున ఉన్నాడో తెలియక, మనసులోనే తన ఇష్టదైవాన్ని ప్రార్థించుకుంది.

అంతలో — టక్...టక్...టక్... లయబద్ధమైన శబ్దం. ఎన్నో ఏళ్ళుగా పరిచయం ఉన్న ఆ శబ్దం తనవైపే వస్తోంది... వస్తోంది... వచ్చేసింది.

'పూజారిగోరేటన్నార్రా ?' మనసులోని ఆత్రుత, మాటల్లో బయటపడుతోంది.

'ఊహూఁ! నాబం నేదట. పుస్తకఁవంతా తిరగేసినాడు.' అలుపు తీర్చుకోవటానికన్నట్టు, చెప్పటం ఆపాడు. ఆ ఆపటం, లచ్చిమికి టెన్షన్ను ఎక్కువ చేసింది.

'ఏటీ ? నాబం నేదన్నాడా?' లచ్చిమి మొహంలో మార్పొస్తోంది.

'ఆఁ!... ఇది మూఢఁవట. మరో మూడ్నెల్లాగితే, బెమ్మాండమైన లగ్గాలున్నాయన్నాడు.'

ఆందోళన పోయింది. 'మరైతే, నిన్నను ఆల్లిపురంలో పెళ్ళి బోజనాల కెళ్ళినాం ?!...' డబ్బున్నవాళ్ళకు లేని మూఢం, పేదవాళ్ళకు, అందునా — వాళ్ళకోసమే వచ్చినందుకు లచ్చిమి ఆశ్చర్యపడింది.

రాము లచ్చిమి మొహంలోనికి చూశాడు. పొంగే పాలల్లో నీళ్ళు చిలకరించినట్టుగా... తను అలా చెప్పగానే, ఆమె మొహంలో ఉండే సంతోషమూ, కళా మాయమైపోయాయి.

'లచ్చీ !' పిలుపులో ఆప్యాయత. 'నిన్నా, మాఁవమా మరో మూడ్నెల్లు దూరంగా వుంచి, మీ వుసురు నేనోసుకోలేనే. ఈ ముక్కే పూజారి గోరితోటన్నాను.'

లచ్చిమి ఏమీ మాట్లాడటంలేదు. రాము భుజంమీద చేయి వేసి, మౌనంగా నడుస్తోంది.

'లచ్చీ !'

'...............'

'పెళ్ళి ! ఈ మాత్తరం దానికే, ఏడుపు మొకఁవెట్టేడఁవెందుకూ ? ఆఁ! ... పూజారి గోరేటన్నారంటే ... ఇదిగో ... '

'నాకేటి సెప్పొద్దునేరా.'

'అంత కోపఁవైతే ఎలాగమ్మా ? మరీ ... పూజారిగోరు రేపాదిలీమన్నాడు. ఎల్లుండి సేసీమ కొమ్మన్నాడు ... పెళ్ళి ... మంచి లగ్గఁవట !' ఆ మాట చెప్పిన రాము మొహం, అడుక్కునేవాడి బొచ్చెలోని ఇచ్చ రూపాయిలా మెఱిసిపోతోంది.

తనకు ఇష్టమైన మాటను విన్న లచ్చిమి — పేదోళ్ళకు ఒళ్ళంతా జలదరించకూడదనే రూల్ రాలేదు కాబట్టి, ఆ అనుభూతిని తనూ పొందుతూ, ఇంతసేపూ తననేడిపించినందుకుగానూ, మూతి సున్నాలా పెట్టి చిఱుకోపం చూపిస్తూ, రాము భుజాన్ని గట్టిగా గిచ్చింది. అలాంటి సందర్భాలు వాళ్ళకు చాలా అరుదు. అందుకే, రోడ్డమ్మట పోయేవాళ్ళు ఏమనుకుంటారోననే బిడియం లేకుండా, ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

అంటే — ఎల్లుట, మంగళ వాద్యాల మధ్య, పట్టు పీతాంబరాలతో, పురోహితుల వేద ఘోషతో లచ్చిమికి పెళ్ళి జరుగుతుంది—అని మీరనుకోవద్దు. అలా జరుగదు. జరక్కూడదు.

ఎందుకంటే — లచ్చిమి మనువు అప్పన్నతో నిశ్చయమైంది. అప్పన్నంటే డోలక్ వాయించి, పబ్లిక్‌ను ఎంటర్‌టైన్ చేస్తూ, వాళ్ళు పడేసిన దాంతో, కొంతలో కొంత కడుపుమంట చల్లార్చుకుంటున్న నిర్భాగ్యుడు. మన భాషలో ముష్టివాడు. అందుచేత — వాళ్ళిద్దరి పెళ్ళి, పార్కులోని గోడ ప్రక్కగా, ఓ పదిమంది ముష్టివాళ్ళ సమక్షంలో, జరిగిపోతుంది. వాళ్ళుకూడా వస్తారో, రారో

చెప్పలేం. సన్యాసీ, సన్యాసీ రాసుకుంటే...సామెతలా, వీళ్ళ పెళ్ళికి వాళ్ళొస్తే, వాళ్ళ కడుపు ఆ రోజు ఖాళీయే !

పెళ్ళికి ఏవేవి కావాలో మాట్లాడుకుంటూ, మాటల మధ్యలో నవ్వుకుంటూ, హుషారుగా నడుస్తున్నారు. ప్రక్కరోడ్‌లో, గొడవగా వినిపించటంతో, రాము మాటలు ఆపేసి, 'లచ్చీ, నిలబడు. నీలామాలు దగ్గిరి సూసొత్తాను' అంటూ, అటుగా వెళ్ళాడు.

లీలా మహల్లో క్రొత్తసినిమా రిలీజ్. గేట్లు మూసి ఉన్నాయి. రేషన్ డిపోకన్నా అధ్వానంగా ఉందక్కడి పరిస్థితి. ఓ ప్రక్క మొబైల్ స్వీట్ స్టాల్స్, ఐస్ క్రీం, వేడి బఠానీలవాళ్ళు — అపుడే గేట్లు తీయించి, మా పొట్టలు కొట్టకు మహాప్రభో అని, థియేటర్ యజమానితో మొఱ పెట్టుకుంటున్నట్టుగా, ఒకటే అఱుస్తున్నారు, వర్షాకాలపు కప్పల్లా !

రాము స్టీల్‌బోర్డ్‌వైపోమారు చూసాడు. 'ఏ' అని రాసున్న ఇంగ్లీషు అక్షరం అర్థం కాలేదుగాని, ఆ అక్షరం క్రింద — బొట్టు సగం చెఱిగి, అస్తవ్యస్తంగా ... పడుకుని ఉన్న ఆడది ! రాముకు అర్థమైపోయింది, ఆ సినిమాకు జనం బాగా వస్తారని !

'బాబూ ! మేట్నీ వాదిలీసారేటి ?'

చలికాలం. అసలే బేరాలు లేవు ... 'ఏం ? ఏటంత తొందరగుంది ? మాం రెండైసు ముక్కలమ్ముకోడం, నీ కిష్టం లేపోతె సెప్పు...పొస్పరైట్రు గారితో సెప్పెసొస్తాను, ఆట బేగె వొగ్గీమని ... నేకపోతే, ఇంకా అయిదేనాగానేదు, అపుడే ఈడి కోసం ఆటొదిలియ్యాలట !! మొకం జూడు, ఇరిగిపోయినైసుముక్కలాగ,' అంటూ రామును కసురుకుని, మరలా 'పాలైస్, నిమ్మైస్, కోనైస్' అంటూ, అఱుపుల్లోనికి వెళ్ళిపోయాడు.

'నాను పెబాతు కెల్తాను. మారుకట్టు కాసెల్లి, మాంవ అగుపడితే తీసుకొస్తాను.' లచ్చిమిని, లీలా మహల్ రెండో గేటు దగ్గఱ కూర్చోబెడుతూ, ఆమె ముందర, ఓ నల్లటి గుడ్డను పఱచి, 'వొచ్చీదాకా జాగరత' అంటూ తగ్గు స్వరంలో హెచ్చరించి, కఱ్ఱ టక టక లాడిస్తూ వెళ్ళిపోయిన రాము, ఆ కఱ్ఱను వాడేది, రావుబహద్దూర్‌లా స్టైల్ కోసం కాదు. అతని ఎడమ కాలూ, ఎడమ చెయ్యీ పనికిరాకనే !

లచ్చిమి తన చేతులతో, ఓ మారు తన కడుపునింపే గుడ్డనూ, మానాన్ని కాపాడే పవిటనూ సర్దుకుని, ఓ నిమిషంపాటు, చుట్టూరా ఉన్న వాళ్ళను, తనపై కనికరం చూపించమన్నట్టు, రెండు చేతులూ జోడించింది. తర్వాత గొంతు నోమారు సవరించుకుని, 'జాలిలేని బ్రమ్మయ్యా... బదులు పలకవేమయ్యా' అంటూ పాడటం మొదలు పెట్టింది.

లచ్చిమికి పదహారేళ్ళుంటాయేమో ! ఆమె కోసం పోలి — అంటే -- స్వంత తండ్రిగా చలామణి అయిన — పెంపుడు తండ్రి, ఎనిమిది సంవత్సరాల లచ్చిమిని, ఏకాకిగా చేసిపోతూ, ఆమెకై ఏమీ మిగల్చలేదు. ఎందుకంటే — పోలి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ క్లర్కూ కాదు, పోనీ బిజినెస్ మేగ్నెటూ కాదు. ఒట్టి ముష్టివాడు.

తీయటి గొంతుగల లచ్చిమి గుడ్డిది. పుట్టుకతో గుడ్డిది కాకపోయినా, ఆ శనివారంనాటి రాత్రి, వెంకటేశ్వరాలయం నుండొస్తున్న పోలికి, కన్నె మరియమ్మ కొండవాలుపులోని పాడుపడ్డ పాకలో, పసిగుడ్డు ఏడుపు. ఏ తల్లి పాప ఫలమో ... ! చుట్టూ చేరి, వాసన చూస్తున్న కుక్కల మధ్యనుండి తీసుకున్నాక, ఈ రాజ్యంలో తనూ, ఆ పిల్లా సులువుగా బ్రతకటానికని... !!

ఏమైతేనేం — లచ్చిమికి కళ్ళు లేకపోవటం, ఒక విధంగా ఆమె అదృష్టమనే చెప్పాలి. అదే ఆమె చేస్తున్న ఈ సెల్ఫెంప్లాయ్మెంట్ స్కీముకు, పెట్టుబడి అయింది. రోజూ, ఆ అన్న కాని అన్న, ఈ సెల్లి కాని చెల్లిని, వాళ్ళు తలదాచుకుంటున్న, పాడుపడ్డ రైల్వే పార్క్ నుండి, టౌన్లోనికి తీసుకు వస్తాడు. అదృష్టం బావుంటే అన్నం... లేకపోతే ఆకలీ... మామూలే !!

పాడుతున్న గుడ్డిదానిచుట్టూ, అక్కడున్నవాళ్ళే కాకున్నా, దారినపోయేవాళ్ళూ మూగుతున్నారు.

'నువ్వూ ఒక మనిసై పుడితే... నాలాగే నీ కనులుంటే...'

అడుగడుగునా ....

"వెంచాలు"
ఇంట్లోనే కాదు
బయట కూడా వుంటాయి
ప్రతి పెద్ద కుర్చీని
నాకుతూంటాయి
కుక్కలు కావు
కనీసం వాటికి
విశ్వాసమయినా వుంది.

— ఎస్. మునిసుందరం

'అయ్యా ! అనాదను. దరమం సెయ్యండి బాబూ. కబోదిపై కనికరం సూపండి నాన్నా, అన్నియ్యా...' అంటూ, పాడే పాటను మధ్య మధ్య ఆపుతూ, అర్థిస్తోంది.

చేరినవాళ్ళలో కొందరికి, ఆమె పాడే పాట వినిపించటంలేదు. ఆమె పొంగులు మాత్రమే కన్పిస్తున్నాయి. మరికొందరు — పెళ్ళినాటి రాత్రే, లైట్లు తీసేసిన పెళ్ళి పందిర్లా — కళా విహీనంగా ఉన్న, ఆమె అందమైన మొహం చూసి, జాలి పడుతున్నారు. మిగిలినవాళ్ళు, లచ్చిమి తీయటి గొంతునుండి వచ్చే, ఏడుపు పాటలని విని, ఆనందిస్తున్నారు.

బ్లాక్‌లో అమ్ముకోవటానికి టిక్కెట్లివ్వని, హాలు మేనేజర్‌ను బూతులు తిట్టుకుంటూ, లీలామహల్ వైపు వస్తున్న శీను, టర్నింగ్‌లోనే ఆగిపోయాడు. తిట్టడం మానేసి, చుట్టూ ఓ మారు, రాము అలైన్ సాట్టోడి కోసం చూసాడు. 'సొట్ట ఎదవ లేడు' స్వగతంగా అనుకుని, లచ్చిమికి దగ్గఱగా వస్తున్నాడు.

తొందరపడి వచ్చేస్తున్న శీతకాలపు చీకటిని థియేటర్ దగ్గరకు రానిచ్చే ఉద్దేశం లేనట్టు, హాలు బయటి లైట్లు ఒక్కమారుగా వెలిగాయి. ఆ వెలుగులో — నల్లటి గుడ్డమీది ఐదు, పది, పావలా నాణాలు — చీకటిలో మెఱిసే పొడపాము కళ్ళలా - మెఱుస్తున్నాయి.

ఓ అరనిమిషంపాటు, లచ్చిమి ఎత్తు గుండెల పైనా, నల్లటి గుడ్డమీది తెల్లటి డబ్బుల పైనా, వాల్‌క్లాక్‌లోని పెండ్యులంలా అటు ఇటూ కాకున్నా, పైకీ క్రిందికీ తిరిగాయి — ఆ కళ్ళు...శీను కళ్ళు... ఆ కళ్ళల్లో కసి !!

ఆ 'కసికి' కారణం — సరిగ్గా రెండేళ్ళ క్రితం...

'ఏటత్తా ! పైటొదిలీసి కూకున్నావు ! బేరాల్లేవేటి ? ?' పళ్ళెంలోనుండో కొబ్బరిముద్దను తీసుకుంటున్న వ్యక్తి వైపు చూసిన రంగమ్మ, గబుక్కున డబ్బుల సంచీ మొలలో దోపుకుని, దానిమీదుగా చీర కొంగును సర్దుకుంటూ, మొహాన్న బలవంతపు నవ్వు పులుముకుని, 'ఏట్రా అల్లుడూ ! బాగున్నావా ?' అడిగింది.

'ఆఁ ఆఁ...రాయుర్తియ్యి. మందుకుబోవాం.'

'ఏటోరా. తిర్నాదుల సోవి రతం (త్రినాథ వ్రతం)లోని, బేపనోడి కత ఇన్నావా ? అతగోడు రెల్లి పెట్టెక్కి, ఎన్ని పైసాలు తెంపినా, కడకి మూడు పైసాలే మిగిలినయ్యట. నా పనీ అలగ్గే వుందిరా. ఏటో గాచ్చారం ... ఎంత కస్టపడ్డా, మూడు మిగలసడం గగనంగుందిరా.' మామూలు ఇవ్వకున్నా, ఎలాగోలా ఆ రౌడీ పీడఒదుల్చుకోవాలని, ఏదేదో చెప్తోంది.

'అత్తా ! ఆపాపు. తిర్నాదుల రతం మనకు తెల్దుగానీ, నీ మొకానికి మూడు సాలవా ? ... ముసలైపోయినా ... పయిటొదిలిస్తే, పది మిగిలి పోతాయనుకున్నావేటే ? ఆఁ ... !'

శీను మాటలకు రంగమ్మ వికారంగా నవ్వి —

'అది కాదురా. ఇయ్యాల్టిదీ, రేపిటిదీ రేపిచ్చెత్తాన్రా.'

'ఏసా లెయ్యకుండా బేగె అంపించే' అంటూ, ఇంకా ఎవరెవరి దగ్గఱ మామూళ్ళు వసూలు చెయ్యాలో చూడటానికై, హాలు గేట్లవైపు చూసాడు.

దూరంగా, గేటు ప్రక్కన ... లైట్ల వెలుగుల్లో ... శీను కళ్ళు వెడల్పు చేసుకు మరీ చూసాడు. 'ఆ గుంటే ! లచ్చిమి !!' ఆ మాటే రంగమ్మతో అన్నాడు.

'అవున్రా ! నీ కళ్ళు దానిమీద వొడ్డాయేట్రా?!'

'అదచ్చంగా నీ పెద్దకూతుర్లాగుందే ... ఎపుడైనా సూడ్డం మానేస్తాడేటి ? ... అగ్సరే, అదెపుడలగైపోయింది ?' శీను రంగమ్మవైపు చూడటంలేదు. దృష్టంతా లచ్చిమిమీదనే. పాత లంగా, పాత జాకెట్టూ, క్రొత్తవోణీ ... లచ్చిమి చేతుల ప్రతిసారీ, వోణనే సర్దుతున్నాయి.

'ఏదీ — ఇయ్యాల్టికి నెలగాలేదు. కొత్త గుంట ... బెదరగొట్టెయ్యకురోయ్' ఆ మాటల్లో కవ్వింపు.

'గుంటప్పుడే గుర్రం న గుంది ... దానా ఏటి

తింటాదోగాని' చౌక రకం ఫిల్టర్ సిగిరెట్ వెలిగించాడు.

'అత్తా! ఈలందరి దగ్గిర, నువు మామూలోనూలు సేసిపెట్టు. ఎవులైనా ఆఁ ఊఁ అంటే, నన్ను సూపించు. దాన్తోమారు పలకరించి...' అంటూ శీను లచ్చిమి వైపు నడిచి, ఆమె మొహంలోనికి పొగ ఊదేడు. పీలుస్తున్న శ్వాసలో, గాలితోబాటు పొగ వాసన!

'ఎవులూ ?' లచ్చిమి అడిగింది.

'నేనూ... శీను మామిఁయిని. బాగున్నావా ?'

'... ... ...'

'నా దగ్గిరి సిగ్గెందుకే ? నిన్ను జూసి నెల్లైంది. అవునూ... ఏటెలగైపోయిందట ? ఆఁ... ఎపుడు జరిగిపోయిందేటె ంఁతా గోరం ?!' పకపకా నవ్వు.

'ఏటైందీ ?' అమాయకపు లచ్చిమి.

'ఓస్ ఏటో! మళ్లీ నా నోటే ఇనాలని నీ సరదా !!' మరలా అదే నవ్వు.

లచ్చిమికి అర్థమైపోయింది. ఆమె మొహంలో ప్రసన్నత స్థానే, కోపం, అసహ్యం...

'ఏం... ? పలకవేటే అమ్మోర్లాగ! ఆ కొత్త పయిట, బూరిబుగ్గలూ, ఆఁ... మరీ... నాకు బువ్వెపుడెడతావే ? ఈ రాతిరికా ? రేపు రాతిరికా ?'

లచ్చిమికి ముక్కుపుటాలూ, పెదవులూ అదురుతున్నాయి.

'ఏటలగైపోతన్నావేటే ? కొత్తలో అందరూ అంతే. బయపడక. తొందరేంలేదుగానీ... ఇయ్యాల రేపు ఆగి, కొంచెం సర్దుకున్నాక... ఆఁ... మీల్సు పెట్టు. నువ్వెడతావులే... నాకు తెలుసు.' పారేసిన సిగిరెట్ పీకను కాళ్ళతో ఆర్పటానికై క్రిందికి చూసాడు.

మాటల శబ్దాన్నిబట్టి, శీను తన ఎదురుగనే ఉన్నాడని ఊహించిన లచ్చిమి, కాండ్రించి...!?

ఊహించినట్టుగనే, శీను మొహం అసహ్యంగా... ఛి...ఛీ... !!

అనుకోని సంఘటనకు, శీనులోని అహం, దుర్మార్గం, రౌడీయిజం అన్నీ బుసలు కొట్టాయి. అంతే — లచ్చిమి రెండు చెంపలూ అదిరిపోయాయి. లచ్చిమిని తన చేతుల్లోనికి తీసుకున్నాడు. మరో రెండు నిమిషాలాగితే, ఆమె ఏమయ్యేదో... కాని, అపుడే సినిమా వదలడం, అంతా చేరి శీనును కంట్రోల్ చేయటం జరిగిపోయింది. అలా లచ్చిమి బ్రతుకు... బ్రతికిపోయింది.

'ఎలాగైనా గుడ్డి గుంట పొగరణచాల' కక్షతో ఆనాడే పగబూనాడు సైంధవుడులాంటి శీను.

'ఛత్! దాన్రోజులు బాగున్నాయి. నేకపోతేటి ? అపుడే సెట్టిబాబొచ్చి ఆరబరునుండి పూరియా బస్తాలు తెమ్మండంవూ అలగే, రోజులు బాగునేక దొరికిపోడంవూ అలగే. నేకపోతే ఆ రాతిరే సొట్టోడికి నాలుగు తగిలించేసి, దీన్ని కొబ్బరి తోటలోకి నాగించీసుందును. నా టైం బాగోనేదు. సరే! ఎద్దాపుడూ ఓ పక్కే తొంగోదు గదా — అపుడు నా టైం బాగునేదు. ఇపుడు దీని టైం బాగునేదు. ఒక్కర్తే దొరికింది. గుంట ఈ రెండు సమచ్చరాల్లోనూ, ఎంతేపుగెదిగిపోయిందీ !! ...

లచ్చి

మీల్సు చేసెయ్యాల ...' ఎదురు కిళ్ళీషాపు దగ్గఱ నిలబడి, ఆలోచిస్తున్న శీనుకు తను కాలుస్తున్న సిగిరెట్‌తోబాటు, ఆలోచనలూ ఆగిపోయాయి.

'సత్తిగా! ఓసార్మినారు పెట్టెలగియ్' అంటూ, షాపు ఓనర్‌వైపు తిరిగాడు.

మేట్నీ ఒదిలేశారు. స్కూల్లో, సెక్సుపాఠాలు నేర్చుకున్నంతగా, సంతోషపడే విద్యార్థుల్లా, బిలబిల మంటూ బయటికివచ్చే వాళ్ళనూ, వెనుకబడితే, ఆ సంతోషం తాము పొందలేమేమోనన్న ఆత్రుతతో, లోనికి దూసుకుపోతున్న వాళ్ళనూ చూస్తుంటే, మేకప్‌లేని కురు పాండవ సైనికుల్లా ఉన్నారు. ఆ అలజడికి భయపడి మొత్తంగా గుడ్డతో డబ్బులు తీసుకుని, గుడ్డిది ఒదిగి నిలబడింది.

ఫస్ట్ షో ఇంటర్వల్. స్టాల్స్‌వాళ్ళ రొద పెరిగింది. ప్రేక్షకులు హాలు బయట పచార్లు చేస్తున్నారు. వారికి నచ్చిన అందాల్నీ, ఒంపుల్నీ, డైరెక్టుగా చూడటం అసభ్యం అని, సభ్యత ముసుగులో 'వాటిని' చూస్తూ, కుర్రకారూ, ముసలికారూ ఆనందపడిపోతున్నారు.

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
"మహిళావాణి"
చూశారా ?
దానిలో పాల్గొనండి !
దానిని చదవండి !!

అవేవీ గమనించ వీలుకాని లచ్చిమి, వీలు కల్పించని దేవుళ్ళను తిడుతూ, పొగడుతూ పాటలు పాడుతోంది. డబ్బులనోమారు చేతులతో తడిమి, 'బాగా దొరికినాయి' అనే ఆనందంతో, ఉల్లాసంగా పాటలు పాడుతూ, మధ్య మధ్య మరో మారు--మరో మారు 'గుడ్డిదాన్ని, అనాధను దరమం బాబూ' అంటూ, అర్థిస్తోంది.

లోపలినుండి బెల్ వినిపించగానే, టీకాల డాక్టరును చూసి, ఇంట్లోకి పరుగెత్తే పిల్లల్లా — అందరూ హాల్లోనికి వెళ్ళిపోయారు.

శీను లచ్చిమి ప్రతి కదలికనూ పరికిస్తూ, అవకాశం కోసం పొంచి చూస్తున్నాడు.

డబ్బులను 'చిక్కాం' అనబడే చిన్న సంచిలో వేసి, మొలను దాచేసుకు నిలబడి, ఎల్లుట జరిగే పెళ్ళి గురించి ఆలోచిస్తోంది. పెళ్ళి...అప్పన్న...!! ఆ గుప్పెడు మనసులో, గంపెడు గుప్తమైన కోరికలు. అంతలో — చిన్న చిన్న చినుకులు. అలిసిన ప్రాణానికి హాయిగా ఉంది.

చినుకులు చిక్కనౌతున్నాయి. ఝోయ్‌మనే శబ్దంతో గాలి. ఆ మూలనెక్కడో పెద్ద మెరుపు. వెంటనే అంతా అంధకారం. స్టాల్సువాళ్ళు వర్షానికి కాకున్నా, విసురుగా వీస్తున్న గాలికి భయపడి చెదిరిపోతున్నారు.

జనరేటర్ సహాయంతో, సినిమా మద్దత్తుతో సినిమా నడుస్తూనే ఉంది, తన చుట్టూ కాంతి దీపాలను కాపలా ఉంచుకుని!

లచ్చిమి పవిటను తలపై వేసుకుంది. కొన్నాళ్ళు క్రిందటి ఇండియన్ ట్రైన్స్‌లా, సొట్టోడు ఎంతకూ రాలేదు. 'ఈ వరసంలో ఆడు మాత్రం ఎల గొస్తాడు ?' అనే ఆలోచనతోనే, 'బాబూ !' అంటూ పిలిచింది.

'...............'

వర్షంలో తడవకున్నా, నిలుచోటానికి ప్రక్కన ఎక్కడైనా తీసుకువెళ్తారేమోననే, ఆశతో పిలిచింది. బదులు లేకపోవటంతో భయపడిపోయింది. గేటు లైట్ల వెలుగుల్లో లచ్చిమిని పరిశీలిస్తున్న ఆ రెండు కళ్ళకూ మహదానందంగా ఉంది. పంజా విసరాలనే ఉంది. కాని... తన ప్రక్కగా ఇంకా పది పదిహేనుమంది వరకూ, వర్షానికి తడవకున్నా ఆగిపోయారు. అందుకే తనూ ఆగిపోయాడు.

చూస్తుండగనే వర్షం కుండపోతగా మారి పోయింది. నాయుదేవుడికీ, వానదేవుడికీ గుడ్డిదాని మీద కనికరం కూడా లేదేమో!? రాళ్ళు విసురుతున్నట్లుగా వడగళ్ళు!

పార్కు జంక్షన్ నుండి ఉండి — ఉండి బస్సో, లారీయో వస్తున్నాయి. లచ్చిమి పూర్తిగా తడిసి పోయింది. వెచ్చగా టీ త్రాగాలనే ఆశ! అటుగా వెళ్తే, బరమా రంగడి టీస్టాలుందని తెల్సు. మొండిధైర్యంతో బయల్దేరింది. అడుగులో అడుగు వేసుకుంటూ నత్తలా నడుస్తోంది. కాళ్ళు నీళ్ళల్లో నానిపోతున్నాయి. ప్రక్కనుండో లారీ, నీళ్ళు చిమ్ముకుంటూ రొయ్ మంటూ వెళ్ళిపోయింది. కాళ్ళను తాకుతూ చెత్తా, డబ్బాలూ, వేగంగా ముందుకు పరుగిడుతున్నాయి. క్రమేపీ, హాల్ లైట్లు విసిరే వెలుగులు దూరం అవుతున్నాయి.

శీను, తనకు అనువైన ఆ ఖాళీ స్థలం చేరేవరకూ, లచ్చిమిని నడువనిస్తున్నాడు.

ఎక్కడో పిడుగుపడ్డ శబ్దం. అర్జునా, పాలుగునా... లచ్చిమి గుండెలమీద చెయ్యి వేసుకుంది. పాపం! అంతటి భయం.

శీను వెంబడిస్తున్నాడు.

మెరుపు... పెద్ద మెరుపు. లచ్చిమికి కాదు. కళ్ళున్నవాళ్ళకైతే మిఱుమిట్లు గొలిపే — మెరుపు. ఆ సెకెనులోనే, ఆ లిప్తలోనే, ఆ వెల్తుర్లో లచ్చిమి వొంపులు, తడిసి శరీరానికి అతుక్కుపోయిన బట్టలు, ఎత్తుగుండెలు — జానపద సినిమాల్లో చూపిస్తారే — అలా — జలకాలాడటానికి ఏ దేవకో, సరస్వతి జంక్షన్‌కే వచ్చినట్టున్న, లచ్చిమి శరీరాన్ని ఆ మెఱుపు వెలుగుల్లోనే కళ్ళతోనే తడిమేశాడు శీను!

ఆ 'అందానికి', అంతటి చలిలోనూ శీను వొళ్ళు వేడెక్కిపోతోంది. శీనుకు, శ్రీనివాసుడెందుకో జ్ఞాపకం వచ్చాడు. 'నువ్వూ నాలాటి రసికుడివే గదట్రా. అందుకే నాలాటోలకోసం, అపుడపుడిలాటి కలరు సెట్టింగులన్నీ సృష్టిస్తుంటావు' మనసులో వికృతంగా నవ్వుకున్నాడు.

చలికి వొణికిపోతూ, తలమీది పవిటను మరోమారు సరిచేసుకుంది. ప్రహరీ గోడ గేటును, ఆ నిమిషం పోతే దాటిపోయేదేమో ! కాని... అపుడే శీను పంజా విసిరాడు.

దడుసుకున్న లచ్చిమి గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆర్తిగా కేకలు వేయబోయిన ఆమె నోటిపై శీను తన ఇనుప హస్తాన్ని వేసి, గేటు లోపలికి లాగేసాడు.

మఱునాడు —

నిశాదేవి చీర కొంగును, మెత్తగా తొలిగించుకుంటూ, బద్ధకంగా బయటకు తొంగి చూస్తున్న భాస్కరుడు, మెల్లగా తన బాల కిరణాలను విశ్వంలోనికి విసరటం ప్రారంభించాడు.

ఆ కిరణాల వేడి తగిలితే, కటిగిపోతామని భయపడుతున్నట్టున్నాయి, మంచు ముక్కల్లాంటి చిన్న చిన్న మేఘాలు. అందుకేనేమో, వాయుదేవుడితో నేస్తం కట్టి, దూరంగా పారిపోతున్నాయి. వాటి పిచ్చికి నవ్వుకుంటున్న అరుణుడు, వాటిని ఏడిపించటానికై, మరికాస్త వాడిగా, వేడిగా తన కిరణాలను విసురుతున్నాడు.

అట్టి శీతాకాలపు ఉషోదయాన —

పుష్యమాసపు చలికి ఒణుకుతున్న పోలీసులు, పోరులూ, పార్క్ జంక్షన్‌లోని ప్రహరి గేటు దగ్గఱ మూగారు.

గేటు లోపల పిచ్చిమొక్కలతో పాడుపడ్డ ఖాళీ స్థలం. బోనులా కనిపించే ఓ పాత చెక్కల బడ్డీ ... గేటుకు తగులుకుని, చుట్టూరా రాత్రి వర్షం మిగిల్చిన చెత్తా, మట్టీలతో, ఈగలు ముసురుతున్న శవం !!

ఆ అర్ధరాత్రి —

రైల్వే పార్కులో ... పరదాల చాటున, చలి చేస్తున్న పోరును, వయసు రగులుస్తున్న వేడితో ఎదుర్కొంటున్నారు అప్పన్న, లచ్చిమీనూ !

'హబ్బా !' లచ్చిమి మూల్గింది. 'మావా ! నా మీద సెయ్యెయ్యకు. వొళ్ళు నొప్పెడతంది' అంటూ, చేతులతో గుండెల్ని కప్పుకుంది.

'లచ్చీ ! ఆ దెబ్బలేటే ? సెప్తాసన్నావు. సెప్పేనేదు ... ఏటిసెప్పు' మెల్లగా లచ్చిమికి మాత్రమే, వినిపించేటట్టుగా అడిగాడు.

'మావా ! ఇప్పుడు కాదులే. రేపు సెప్తాను.'

'స్ ! మెల్లిగా ... సాట్టోడు నెగుస్తాడు. మరి ... మొన్నడిగితే, ఇయ్యాలన్నావు. మళ్ళీ ... రేపంతన్నావు. అసలేట్టైందే ?'

'సెప్తాను మావా !' ఆ మాటన్న లచ్చిమి, ఓ నిమిషంపాటు ఏం చెప్పనేలేదు. అంతటి విషయాన్ని చెప్పటానికి ధైర్యాన్ని పెంచుకోవటానికన్నట్టు, గట్టిగా ఓమారు ఊపిరి పీల్చుకుంది.

'ఏటే ?' అప్పన్నకు అసహనం.

'మావా ! మొన్నటి వరసం రోజు ... మీ కోసం నిలబడి నిలబడి, తడిసిపోయి సలేత్తుంటే, రంగడి కొట్టుకాసి ఎల్తన్నాను' లచ్చిమి, అప్పన్న చెవి దగ్గఱగా చెప్తోంది. అప్పన్న 'ఊ' కొడ్తున్నాడు.

'ఎల్తున్న నన్ను, ఆ ఎదవొచ్చి పక్కకి లాగేసాడు.'

'ఎవుడే ఆడూ ?'

'ఆడే ... ఆ రవుడీసెదవ, శీను.'

'ఆడా ?? సచ్చినాడు గదేటే ?!'

'ఆఁ ... పీడా ఇరగడై పోయింది. ఆడు బతికుంటే, నన్ను బతకనివ్వడు. అందుకే ... అందుకే ... ' ఆపై చెప్పలేనట్టు, లచ్చిమి సన్నగా ఏడుస్తోంది.

'పోన్లే ఊరుకోయే ... ఇక సెప్పొద్దులే' అప్పన్న ఓదార్పు.

ఓ రెండు నిమిషాల మౌనం. స్టేషన్లోనికి, 'కోనార్క్' వచ్చినట్టుంది.

'మావా ! పూర్తిగా సెప్పేనియ్. సెప్పేస్తేనే గాని, మనసు సులకనయ్యేటట్టు నేదు. ఈ యినయం కడుపులో ఎట్టుకొని, నీతో సరిగ్గా ఉండనేకపోతన్నాను. అందుకే – ఎవులికీ తెలియని ఇనయం, నీకు సెప్తన్నాను. కడుపులో ఎట్టుకొని, నన్ను కాపాడుకుంతావా ?'

'ఏట్టైందే?...నాకేం అరదం గావడం నేదు.'

'మావా ! ఆడు ... ఆడు సచ్చిపోనేదు. సంపేసినాను.'

'స్సె ! నోరుముయ్యే...పరాసికాలాడతన్నావా?'

'నేదు మావా ! నిజఁవే. అసలేట్టైందంటే – అక్కడంతా ముల్ల డొంకలు. సిక్కాం లాగేసినాడు. డబ్బుపోతే పోయింది. ఏటేటో అన్నాడు. ఇంకా... ఏటేటో సెయ్యబోతంటే ... సెనుగులాడ్నాను. బతిమలాడ్నాను. అన్నా, నీకు సెల్లిల్లునేరా ? అని కాల్లట్టుకున్నాను. ఏదో అంటారు గదా — లేడి కంట ఏడితోటే, ఏటగోడికేం పనని...అచ్చవలగె... సెల్లిల్లునేరా అన్నమాట కాయెదవన్నాడూ, నేకేనే... ఆలు పతివరతలు. నీలాగ అన్నా అన్నా అంటూ, 'ఆ సాట్టోడి ... ' అప్పన్న లచ్చిమి నోరు మూసేసాడు.

ప్రక్క రోడ్డమ్మట, ఉండీ–ఉండీ ఆటోలూ, రిక్షాలూ వెళ్తున్న చప్పుళ్ళు.

'మావా ! దేవుడిలాటి అన్నను ఆ ముక్కనీ సరికి, నాకు ఎంతోటి కోపఁవో సెప్పలేను. కత్తుంటే కైమా ... ఆ ఎర్రి కోపంలో ఏ సేస్తున్నానో, నాకే తెల్దు. కొరికి, గుద్ది .. అరిసినాను. వరసం పడతానే ఉంది. కేకలేసాను అరిసాను మీరొత్తారేవోనని...వూఁహుఁ...ఎవులూ రానేదు.

ఆ యెదవకి బుద్ది మారనేదు. అలాగ సెనుగులాడ్తా, సివరికి నన్నాడు కిందికి తోసేసి, నా మీద పడిపోనాడు. పడిపోయిన నాకు, అయే సివరి గడియలనుకున్నాను.

పిచ్చికోపం. అద్దేదో సేసెయ్యాలని కచి. అపుడే గుర్తుకొచ్చింది, ఓ రెండు సమచ్చరాల కిందట యినయం. రైల్వే కోట్టర్సులో ఓ యమ్మను, ఎవుడో ... పిల్లల తల్లనైనా సూడకున్నా ... ఏదో సెయ్యబోతే ఆ తల్లికి మరేం తోసక...మాన్నం కాపాడుకోడానికి ఆడి "అయుగు" పట్టును తెంపేసి... !!'

'లచ్చీ ! ? ! ? !'

'మావా ! నానూ ఆ పనే సేసినాను. తప్పా మావా ?'

'లచ్చీ' అంటూ ఆమె తలపై ఓ చేయి వేసి నిమురుతూ, ఓ చేత్తో ఆమెను అదుముకుంటూ 'నేదే... నేదు. ఆడికేగాదు, అసలలాటి ఎదవలందరికీ, అదేనే సరైన సిచ్చ !!'

'మావా! అలా సేయప్పోతే ఆడు నన్ను... పాడుజేసేస్తాడు. పాడయి, నీ దగ్గిరికి రాలేను మావా... సస్తాను తప్పు !'

'లచ్చీ !'

'అవును మావా ! సచ్చీదాకా నీతోటి బతకాలనే ఆడ్నీ... ఆ యెదవని సంపేసినాను మావా!' అంటున్న లచ్చిమిని ఉప్పొంగిన అభిమానంతో, ఆపై అప్పన్న మరి మాట్లాడనీలేదు. ★